సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 13 । జనవరి । 2024



.. పందెం కోళ్లు
తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో సంక్రాంతికి ముందుగానే పందేల హడావుడి ప్రారంభమైంది.
10లో



లక్ష్యసాధనలో మేటి..
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కిష్టారం ఓసీ నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 83 రోజుల ముందుగానే పూర్తిచేసింది.
12లో

గరిష్టం / కనిష్టం
31° / 19°
వాతావరణం
జిల్లాలో శనివారం పగటిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. రాత్రి వేళ చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం జరిపారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం మూల విరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్ర పుష్పం, కుంకుమ పూజ, గణపతిహోమం తదితర పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకవర్గ మండలి సభ్యులు గంధం వెంగళరావు, కిలారు నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

ఊరెళ్తే పోలీసులకు సమాచారం ఇవ్వండి

ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంటౌన్: సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్లేవారు ముందస్తు జాగ్రత్తగా పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఊరికి వెళ్లితే పోలీసులతోపాటు పక్కన ఉన్నవాళ్లకు సమాచారం ఇవ్వాలని, ఇంటిని కనిపెట్టి ఉండాలని చెప్పాలని కోరారు. సీసీ కెమెరాలు, వాచ్‌మెన్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనుమానితులు కనిపిస్తే డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. చోరీల నియంత్రణకు చర్యలు చేపట్టామని, రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సింగరేణి ఆస్తులను పరిరక్షించాలి


సేఫ్టీ జీఎంను సన్మానిస్తున్న సెక్యూరిటీ అధికారులు, ఉద్యోగులు

సింగరేణి(కొత్తగూడెం): శిక్షణ పొందిన సెక్యూరిటీ సిబ్బంది విధి నిర్వహణలో నైపుణ్యం చూపి సింగరేణి సంస్థ ఆస్తులను పరిరక్షించాలని రీజినల్ సేఫ్టీ జీఎం జె.కుమారస్వామి సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలోని ఎస్‌అండ్‌ పీసీ ట్రైనింగ్ సెంటర్‌లో 45వ బ్యాచ్‌కు నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్యూరిటీ సిబ్బంది అన్ని ఏరియాల్లో నిర్వహించిన హెల్మెట్ ర్యాలీల ద్వారా అవగాహన పెరిగి, ప్రమాదాలు తగ్గాయని పేర్కొన్నారు. నీతి, నిజాయతీ, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఉద్యోగులు అంధుల సేవాలయానికి వితరణ చేశారు. జీఎంను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ ఆఫీసర్ జాకిర్ హుస్సేన్, జమేదార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత విజేతగా నిలవాలి

అదనపు కలెక్టర్ రాంబాబు


వివేకానందుడి చిత్రపటానికి నివాళి..

సూపర్‌బజార్(కొత్తగూడెం): యువత పోటీ ప్రపంచంలో విజేతగా నిలవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు సూచించారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అదనపు కలెక్టర్ వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. జిల్లా క్రీడల అధికారి పరంధామరెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణి, డీటీఆర్వో శ్రీనివాసరావు, డీసీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుసుమకు ప్రథమస్థానం
జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో పోస్టర్ మేకింగ్ పోటీల్లో సింగరేణి పీజీ కళాశాల విద్యార్థిని కె.కుసుమ ప్రథమస్థానంలో నిలిచింది. శుక్రవారం ఆమెకు అదనపు కలెక్టర్ డాక్టర్ పి.రాంబాబు బహుమతి ప్రదానం చేశారు. ప్రిన్సిపల్ సీహెచ్ శారద, కె.ఆశాజ్యోతి పాల్గొన్నారు.

అధికారులు సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్లు



ఇసుక మాఫియాపై కన్నెర్ర

ఇన్నాళ్లు ఇష్టారీతిగా సాగిన ఇసుక దందా
- అక్రమార్కులకు అండగా ఖద్దరు నేతలు
- ఇటీవల అధికారులపై మాఫియా దాడి
- తీవ్రంగా పరిగణించిన అటవీశాఖ మంత్రి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఇంత కాలం ఖద్దరు చొక్కాల అండతో అక్రమంగా సహజ వనరులను కొల్లగొట్టిన కేటుగాళ్లపై ఉక్కు పాదం మోపేందుకు అధికారులు సిద్ధమయ్యారు.

అంతా అనధికారికమే..
నిర్మాణ రంగానికి సంబంధించిన ఇసుక కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రీచ్‌లు ఏర్పాటు చేసింది. అవసరం ఉన్నవారు తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వెబ్‌సైట్ ద్వారా ఇసుక కొనుగోలు చేయవచ్చు. ప్రస్తుతం జిల్లాలో గోదావరి తీరం వెంబడి ప్రభుత్వ ఆధీనంలో రీచ్‌లు ఉన్నాయి. అయితే నూటికి తొంభై మంది టీఎస్‌ఎండీసీ వెబ్‌సైట్ ద్వారా ఇసుక కొనడం లేదు. అంతా అనధికారిక మార్గాల ద్వారానే ఇసుక క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అడవులు, వాగులు, నదుల వంటి సహజ వనరులు జిల్లాలో సమృద్ధిగా ఉన్నాయి. దీంతో ప్రభుత్వం నిర్దేశించిన ఇసుక రీచ్‌లకు సమాంతరంగా అనధికారికంగా ఇసుక రీచ్‌లను నిర్వహించే మాఫియా జిల్లా అంతటా విస్తరించింది.

ఎక్కడికక్కడ సిండికేట్ దందా
స్థానిక అవసరాల పేరుతో ఇసుక మాఫియా గోదావరి, కిన్నెరసాని, ముర్రేడు, పాములేరు వంటి వాగులను కబళిస్తున్నారు. పరిమితికి మించి ఇసుకను తోడేయడం వల్ల వాగులు, నదులు తమ రూపాన్ని కోల్పోతున్నాయి. ఒకప్పుడు ఇసుక తిన్నెలతో కనిపించిన ముర్రేడు వాగు ఇప్పుడు ఇసుక మాఫియా కారణంగా రాళ్లు తేలింది. జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ సిండికేట్లుగా మారి దందా సాగిస్తున్న ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేయకపోతే కిన్నెరసాని, పాములేరు వంటి ప్రవాహాలు కూడా తమ ఆకృతిని కోల్పోవడానికి ఎక్కువ సమయం పట్టదు.

చట్టాలకు తూట్లు
ఇసుక మేటలు తగ్గితే ఆ మేరకు భూగర్భజల మట్టాలు తగ్గడంతోపాటు తీరం వెంబడి కోతలు పెరుగుతాయి. అందువల్లే జల ప్రవాహాల రక్షణ కోసం ప్రత్యేకంగా వాల్టా వంటి చట్టాలు వచ్చాయి. కానీ ఈ చట్టాలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా ఇసుకను వాగులు వంకల నుంచి తోడేయడం అలవాటుగా మారింది. ఖద్దరు బలం ఈ మాఫియాకు తోడు కావడంతో రాత్రి పగలు తేడా లేకుండా జరిగిన ఈ దోపిడీకి అడ్డుకట్టే లేకుండా పోయింది. ప్రస్తుతం జిల్లాలో, అటు రాష్ట్రంలో అధికార మార్పిడి జరగడంతో పరిస్థితిలో మార్పు మొదలైంది.

ఇకపై కఠినమే..
టేకులపల్లిలో ఫారెస్టు సిబ్బందిపై జరిగిన దాడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంతో ఏకంగా అటవీశాఖ మంత్రి కొండా సురేఖ స్పందించారు. ఇసుక మాఫియాకు హెచ్చరికలు జారీ చేశారు. గతేడాది అటవీ రక్షణ విధుల్లో చల్లమల్ల శ్రీనివాసరావు సైతం ఈ జిల్లాలోనే ప్రాణాలు కోల్పోయిన వైనం మరోసారి చర్చకు వచ్చింది. దీంతో అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులు ఇటీవల జిల్లాలో పర్యటించి సిబ్బందిలో ఆత్మస్థైర్యం నింపారు. దీంతో ఇసుక అక్రమ రవాణాతో పాటు కలప అక్రమ రవాణాపై కూడా ఫారెస్టు సిబ్బంది దృష్టి సారించారు. మరోవైపు పోలీసు శాఖ సైతం ఈ అంశంపై ఫోకస్ పెట్టింది. టేకులపల్లి పోలీసులు ఏకంగా ఇరవై మంది ట్రాక్టర్ల యజమానులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు.

దాడులకు తెగబడ్డ మాఫియా
టేకులపల్లి మండలంలోని అటవీ ప్రాంతంలో ప్రవహిస్తున్న ముర్రేడు, దాని ఉప వాగుల్లోని ఇసుకను రాత్రి వేళ తరలించడం పరిపాటిగా మారింది. ఇలా తోడేసిన ఇసుకను తెల్లవారుజామున టేకులపల్లి, ఇల్లెందు, కారేపల్లి మండలాల్లో అక్రమంగా అమ్మకాలు సాగించే వారు. ఈ దందాలో సుమారు వంద వరకు ట్రాక్టర్లు ఉండేవి. గడిచిన ఐదేళ్లలో ఈ దందా మూడు పవ్వులు ఆరు కాయలు అన్నట్టుగా జరిగింది. వీరి జోలికి వచ్చిన అధికారులపై రాజకీయ ఒత్తిళ్లు బలంగా పని చేయడంతో వీరి ఆటలు సాగాయి. ఇటీవల ప్రభుత్వం మారిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. ఇసుక అక్రమ రవాణాపై అధికారులు కన్నెర్ర చేయడంతో ఆగ్రహించిన మాఫియా ఏకంగా ఫారెస్టు అధికారుల పైనే దాడులకు తెగబడింది.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ఇసుక, కలప అక్రమ రవాణాపై ప్రత్యేకంగా ఫోకస్ చేశాం. తనిఖీలు ముమ్మరం చేస్తున్నాం. అటవీ ఉత్పత్తులను అక్రమంగా తరలిస్తే చూస్తూ ఊరుకోం. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.
– కర్నావత్ వెంకన్న, ఇల్లెందు ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్

■ 'ఆర్టీసీ'లో ప్రయాణికుల రద్దీ



టీఎస్ ఆర్టీసీ బస్సుల్లో పండుగ ప్రయాణికుల తాకిడి పెరిగింది. సంక్రాంతి పర్వదినం, విద్యాసంస్థలకు సెలవులు ఇవ్వడంతో పలువురు పట్టణాల నుంచి సొంతూళ్లకు వస్తుండగా రద్దీ నెలకొంది. శుక్రవారం కొత్తగూడెం తదితర బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. ప్రయాణికుల సంఖ్యకు తగినట్లు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామని ఆర్టీసీ అధికారులు ప్రకటించినా ఆచరణలో కనిపించలేదు. –చుంచుపల్లి

రైళ్లు రానట్టేనా..?



భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్

- గతంలో బీడీసీఆర్ స్టేషన్ నుంచి ఏడు రైళ్ల రాకపోకలు
- ప్రస్తుతం నడుస్తున్నవి రెండే.. మరొకటి వరంగల్ వరకు కుదింపు
- సంక్రాంతి పండుగ నేపథ్యంలో పెరిగిన ప్రయాణికుల రద్దీ
- ఆర్థికభారమైనా ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులే దిక్కు
- ఆదాయం తప్ప ప్రయాణికుల సేవలు పట్టని దక్షిణ మధ్య రైల్వే

కొత్తగూడెంఅర్బన్: దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల రాముడి దర్శనానికి నిత్యం అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. కొత్తగూడెం(భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్) నుంచి బొగ్గు రవాణా ద్వారా రైల్వేశాఖ ఏడాదికి రూ.650 కోట్లకు పైగా ఆదాయం గడిస్తోంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్నా ఈ ప్రాంత ప్రయాణికులకు రైల్వే శాఖ సౌకర్యాలు కల్పించడంలేదు. కేవలం ఆదాయ మార్గాలపైనే దృష్టి పెడుతోంది.

కరోనా కాలం నుంచి ప్రయాసే..
జిల్లా కేంద్రం, పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం నుంచి ఉద్యోగాలు, వ్యాపారం, బంధువుల ఇళ్లకు సింగరేణి కార్మికులు కుటుంబాలతో సహా నిత్యం వెళ్తుంటారు. కొత్తగూడెం, మణుగూరు ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్, బల్లార్ష వరకు ప్రయాణిస్తుంటారు. సింగరేణి గనుల ప్రాంతాలకు రాకపోకలకు ఎక్కువగా సాగిస్తుంటారు. సులభతరం, తక్కువ ఖర్చు, సౌకర్యవంతంగా ఉండటంతో పలువురు రైలు ప్రయాణానికే మొగ్గు చూపుతారు. కాగా కరోనా సమయం నుంచి కొత్తగూడెం స్టేషన్ నుంచి నడిచే రైళ్లు పూర్తి స్థాయిలో ప్రయాణికులకు సేవలందించడం లేదు. తరచూ రైళ్లను రద్దు చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సులను ఆశ్రయిస్తూ అధిక డబ్బులు వెచ్చించాల్సివస్తోంది.

సంక్రాంతికి ప్రయాణికుల రద్దీ..
ప్రస్తుతం సంక్రాంతి పండుగ రావడంతో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. కానీ రైళ్ల రద్దు, కొంతదూరం రైళ్ల రాకపోకలు సాగించడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రద్దయిన రైళ్లను ప్రారంభించాలని కోరుతూ కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. రైల్వే శాఖ మంత్రి, జీఎంలకు వినతిపత్రాలు అందించినా ప్రయోజనం లేదు. రైళ్ల రద్దుతో వ్యాపారం కూడా పడిపోయిందని కొత్తగూడెంలోని వ్యాపారవర్గాలు పేర్కొంటున్నాయి.

తాత్కాలిక రద్దు పొడిగిస్తూ..
కొత్తగూడెం నుంచి నడిచే రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కరోనా కాలం నుంచి తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటిస్తూ వస్తున్నారు. గతంలో ఇక్కడి నుంచి ఏడు రైళ్లు నడిచేవి. సింగరేణి ఎక్స్‌ప్రెస్, డోర్నకల్ ప్యాసింజర్, విజయవాడ ప్యాసింజర్, కాజీపేట ప్యాసింజర్, కాకతీయ ప్యాసింజర్, కొల్హాపూర్ ఎక్స్‌ప్రెస్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ రాకపోకలు సాగించాయి. ప్రస్తుతం కాకతీయ ప్యాసింజర్, మణుగూరు సూపర్‌ఫాస్ట్ రెండు రైళ్లు మాత్రమే నడుస్తున్నాయి. ఇక కాగజ్‌నగర్ వరకు నడవాల్సిన సింగరేణి ఎక్స్‌ప్రెస్ వరంగల్ వరకే నడుస్తోంది.

అనుకున్నస్థాయిలో ఆదాయం లేదనే..?
జిల్లా కేంద్రంతోపాటు మణుగూరు, భద్రాచలం, ఇల్లెందు, పాల్వంచ ప్రాంతాల నుంచి సింగరేణి రైలులో ఎక్కువగా డోర్నకల్, వరంగల్, జమ్మికుంట, మందమర్రి, సిర్పూర్‌కాగజ్‌నగర్ వంటి ప్రాంతాలకు ప్రయాణికులు వెళ్తుంటారు. ప్రస్తుతం రైళ్లు లేకపోవడంతో ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. దీంతో చార్జీల భారం పడుతోంది. అయితే వరంగల్, ఉప్పల్ స్టేషన్ వద్ద మూడో లైన్ పనులు కొనసాగుతుండటం, అనుకున్న స్థాయిలో ఆదాయం రాకపోవడంతో మిగతా రైళ్లను నిలిపివేశారని ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి.

జీఎం కొత్తగూడెంలో ఆగనే లేదు..
జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో రైల్వే జీఎం వార్షిక తనిఖీలు చేపట్టారు. గత బుధవారం దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ మణుగూరు, చంద్రుగొండ స్టేషన్లను తనిఖీ చేశారు. అనంతరం ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ సీహెచ్‌పీని సందర్శించి బొగ్గు రవాణాపై ఆరా తీశారు. బొగ్గు లోడింగ్ ప్రాంతాల్లో తనిఖీ చేసిన ఆయన కనీసం ప్రయాణికుల సౌకర్యాలపై ఆరా తీయలేదు. కొత్తగూడెం స్టేషన్‌లో ఆగకుండానే వెళ్లిపోవడంతో జిల్లావ్యాప్తంగా వివిధ వర్గాల వారు, స్వచ్ఛంద సంస్థలు, రైల్వే లైన్ సాధన కమిటీ బాధ్యులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పండుగ సమయంలోనైనా నడపాలి



సంక్రాంతి పండుగ వచ్చేసింది. దీంతో ప్రయాణికులు ఎక్కువ సంఖ్యలో బంధువుల ఇళ్లకు రాకపోకలు సాగిస్తారు. రైలులో ప్రయాణం సౌకర్యవంతంగా ఉంటుంది. అందుకే ఎక్కువ మంది రైళ్లలోనే ప్రయాణిస్తుంటారు. ఇలాంటి సమయంలో రైళ్లను తిరిగి ప్రారంభించాలి. సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలును సిర్పూర్‌కాగజ్‌నగర్ వరకు నడపాలి.
– రాజేష్‌ఖన్నా, విద్యాధరి ఫౌండేషన్ అధ్యక్షుడు

సేవతో ప్రజలకు చేరువ

కలెక్టర్ ప్రియాంక ఆల


కోరం కనకయ్య దంపతులకు సన్మానం..

చుంచుపల్లి: రాజకీయ నాయకులు నిత్యం ప్రజల మధ్య ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తేనే ప్రజలకు మరింత చేరువవుతారని కలెక్టర్ ప్రియాంక ఆల పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన జెడ్పీ మాజీ చైర్మన్, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జెడ్పీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఎమ్మెల్యేగా గెలిచిన కనకయ్య పరిపాలనలో ప్రజల మన్ననలు పొందారని చెప్పారు. జిల్లా అభివృద్ధికి కృషి చేశారని అన్నారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య మాట్లాడుతూ భద్రాద్రి జిల్లా పరిషత్‌కు తొలి చైర్మన్‌గా ప్రాతినిధ్యం వహించే అవకాశం తనకు దక్కిందన్నారు. జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్ర శేఖర్‌రావు, అదనపు కలెక్టర్ మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, ఉపాధి కల్పన అధికారి వేల్పుల విజేత, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీడీఓలు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం కనకయ్య దంపతులను పూలమాలలు, శాలువాలతో కలెక్టర్ తదితరులు సత్కరించారు.

మూడేళ్లుగా..

- సా..గుతున్న సీతమ్మ సాగర్ రహదారి నిర్మాణం
- రూ. 90 కోట్ల వ్యయంతో 2021లో పనులు ప్రారంభం


గొల్లగూడెం నుంచి దుమ్ముగూడెం ఆనకట్ట వరకు నిర్మిస్తున్న రహదారి

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెంలో సీతారామ ప్రాజెక్ట్ కెనాల్ వంతెన పక్క నుంచి దుమ్ముగూడెం ఆనకట్ట వరకు నిర్మిస్తున్న సిమెంటు రహదారి పనులు నత్తనడకన సాగుతున్నాయి. దుమ్ముగూడెం ఆనకట్ట, సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్దకు భారీ యంత్రాలు, వాహనాలు సులువుగా వెళ్లేందుకు వీలుగా గొల్లగూడెం నుంచి ఆనకట్ట వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గోదావరిలో 63 అడుగుల వరద వచ్చినా ముంపునకు గురికాకుండా రహదారి నిర్మిస్తున్నారు. రూ.90 కోట్లతో 2021లో పనులు ప్రారంభించారు. కానీ ఇంకా పూర్తికాలేదు. సీసీ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నా మార్గంమధ్యలో అమ్మగారిపల్లి వద్ద, బండిరేగులవాగు, జిన్నెలవాగు, చింతిర్యాల వద్ద అలుగువాగులపై వంతెనలు, అమెర్ద, చింతిర్యాల వద్ద ర్యాంపుల పనులు నెలల తరబడి సాగుతూనే ఉన్నాయి. జలవనరుల శాఖ అధికారులు దృష్టి సారించి రహదారి పనులు వేగవంతం చేసి సీతమ్మ సాగర్ రహదారి త్వరితగతిన పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పనులు వేగవంతం చేస్తాం
సీసీ రోడ్డు పనులు తుది దశకు చేరుకున్నాయి. వాగుల వద్ద వంతెనలు, ర్యాంపుల పనులు జరుగుతున్నాయి. రహదారి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం.
–వెంకటేశ్వరరావు, ఈఈ, జలవనరులశాఖ

కనుల పండువగా కూడారై ఉత్సవం

ఫిబ్రవరి 12 నుంచి వాగ్గేయకారోత్సవాలు


స్వామివారికి సమర్పిస్తున్న ప్రసాదం

భద్రాచలం: శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో శుక్రవారం కూడారై ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో జరిపారు. ధనుర్మాసోత్సవాల్లో 27వ రోజు ఈ వేడుక నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. గోదాదేవి అమ్మవారికి శ్రీరంగనాథునితో వివాహం జరిగితే 108 గంగాళాలతో పాయసం నివేదన చేస్తానని మొక్కుకొని మొక్కును తీర్చారని ప్రతీతి. స్వామివారితోపాటు గోదాదేవి అమ్మవారిని బేడా మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. ద్రవిడ ప్రబంధాలతోపాటు పాయసాన్ని సమర్పించారు. భక్తులకు ప్రసాదాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వచ్చే నెల 12 నుంచి వాగ్గేయకారోత్సవాలు
భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వచ్చే నెల 12 నుంచి వాగ్గేయకారోత్సవాలు జరగనున్నాయి. రాముడికి భక్తాగ్రేసరుడిగా పేరుగాంచిన భక్త రామదాసు జయంతి సందర్భంగా దేవస్థానం సన్నిధిలో ఏటా భక్త రామదాసు జయంతి ప్రయుక్త వాగ్గేయకారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఫిబ్రవరి 12 నుంచి 16 వరకు వేడుకలను జరపనుండగా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సంగీత కళాకారులు పాల్గొననున్నారు.

స్వర్ణకవచధారణలో..
దేవస్థానంలోని అంతరాలయంలో స్వామివారి మూలమూర్తులు శుక్రవారం స్వర్ణకవచధారులై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువు దీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకలాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

భద్రాద్రి రామయ్యకు అయోధ్య అక్షింతలు
భద్రాచలంటౌన్: అయోధ్య నుంచి తీసుకొచ్చిన అక్షింతలను శుక్రవారం భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో అందజేశారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో మేడూరి వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు అక్షింతలను ఆలయ ఏఈఓ భవానీ రామకృష్ణకు అందించారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

20న నవోదయ ప్రవేశ పరీక్ష

కొత్తగూడెంఅర్బన్: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 2024–25 సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 20న పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఉదయం 11.30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు జరుగుతుందని, జిల్లాలో 9 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని వివరించారు. కొత్తగూడెం–3, భద్రాచలం–2, ఇల్లెందు–2, బూర్గంపాడు, అశ్వారావుపేటలలో ఒక్కోటి చొప్పున కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా నుంచి 1,325 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి అడ్మిట్ కార్డులు పొందాలని, గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. వివరాలకు ఏసీజీఈ ఎస్.మాధవరావును 99890 27943 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇల్లెందు చైర్మన్‌పై అవిశ్వాసం!

కలెక్టరేట్‌లో నోటీస్ అందజేసిన మున్సిపల్ కౌన్సిలర్లు


మున్సిపల్ కార్యాలయం

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావుకు మరోసారి పదవీగండం ఏర్పడింది. 19 మంది కౌన్సిలర్లు గురువారం కలెక్టరేట్‌లో అవిశ్వాస నోటీస్ అందజేశారు. ఇప్పటికే రెండు దఫాలుగా నోటీస్ ఇచ్చినా అధికారులు తగిన నిర్ణయం తీసుకోలేదు. ఒకసారి నమూనా ప్రకారం లేదని నోటీస్ తిప్పి పంపారు. ఈ సారి ఫార్మాట్ ప్రకారం ఫారమ్–1పై సంతకాలు చేసి నోటీస్ అందజేశారు. అవిశ్వాస నోటీస్ మీద సంతకాలు చేసిన వారిలో వాంకుడోతు తార, చీమల సుజిత, సందా బిందు, తోట లలితశారద, కడకంచి పద్మ, పాబోలు స్వాతి, సామల మాధవి, కటకం పద్మావతి, సిలివేరు అనిత, కొక్కు నాగేశ్వరరావు, సయ్యద్ ఆజమ్, కొండపల్లి సరిత, యలమందల వీణ, చెరుపల్లి శ్రీనివాస్, గిన్నారపు రజిత, సయ్యద్ జానీపాషా, మడత రమ, రేళ్ల నాగలక్ష్మి, కుమ్మరి రవీందర్ ఉన్నారు. కాగా గతేడాది ఫిబ్రవరి నుంచి మున్సిపల్ పాలకవర్గంలో అసమ్మతి కొనసాగుతోంది. పాలకవర్గంలో 24 మంది సభ్యులు ఉన్నారు. అవిశ్వాసంపై సంతకం చేసినవారిలో బీఆర్‌ఎస్, ఇతర పార్టీల వారు కూడా ఉన్నారు. చైర్మన్ వెంకటేశ్వరరావు కౌన్సిలర్ల ఆదాయానికి గండికొట్టారని, ప్రజల ముందు చులకన చేసే చర్యలు చేపట్టారని, అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం చేయలేదని ఫిర్యాదు పత్రంలో పేర్కొన్నారు.

క్లుప్తంగా

వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న వ్యవసాయ విద్యార్థులు

అశ్వారావుపేటరూరల్: వ్యవసాయ యూనివర్సిటీ స్థలాన్ని నూతన హైకోర్టు భవనాల నిర్మాణానికి కేటాయిస్తూ జారీ చేసిన జీఓను రద్దు చేయాలని స్థానిక వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాల ప్రధాన గేటు వద్ద విద్యార్థులంతా బైఠాయించి, భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. తక్షణమే స్థలం కేటాయింపునకు ఇచ్చిన జీఓ నంబర్ – 55ను వెనక్కి తీసుకోవాలని కోరారు.

ఎఫ్‌డీఓ కార్యాలయంలో పాము కలకం



బంధించిన పాముతో ఎఫ్‌డీఓ వెంకన్న

ఇల్లెందురూరల్: ఇల్లెందు అటవీశాఖ డివిజనల్ కార్యాలయంలోకి శుక్రవారం రక్తపింజర పాము ప్రవేశిస్తున్న క్రమంలో అక్కడే ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు గుర్తించి కేకలు వేశారు. ఏంజరిగిందోనన్న కంగారుతో బయటకు వచ్చిన ఎఫ్‌డీఓ కర్నావత్ వెంకన్న, సిబ్బంది ఒక్కసారిగా పామును చూసి హడలిపోయారు. అక్కడే ఆందోళన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు కూడా గుమిగూడటంతో పాము అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించింది. దీంతో ప్రత్యేక పరికరంతో ఎఫ్‌డీఓ వెంకన్న స్వయంగా పామును పట్టుకొని కార్యాలయ సిబ్బంది సహాయంతో సమీపంలోని అడవిలో వదిలారు. ఈ ఘటనకు స్పందించిన ఎఫ్‌డీఓ వెంకన్న కార్యాలయ పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు.

108లో ప్రసవం



పుట్టిన బిడ్డతో సిబ్బంది

పాల్వంచరూరల్: 108 వాహనంలో తరలిస్తుండగా ఓ గర్భిణి ప్రసవించింది. మండలంలోని ఉల్వనూరుబంజర గ్రామానికి చెందిన గర్భిణి ఆలకుంట లక్ష్మిని ప్రసవం కోసం 108లో శుక్రవారం తరలిస్తున్నారు. మార్గమధ్యలో పురిటినొప్పులు తీవ్రం కావడంతో ఈఎంటీ ఉమాదేవి వాహనంలోనే లక్ష్మికి డెలివరి చేసింది. అమ్మాయి జన్మించగా తల్లీ, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు.

విద్యార్థి అదృశ్యం

ఇల్లెందు: మండలంలోని మామిడిగుండాల గ్రామానికి చెందిన డిగ్రీ చదువుతున్న ఎం.నాగచరణ్ (19) కనిపించకుండా పోయాడు. ఈ నెల 4న మామిడిగుండాల నుంచి ఖమ్మం ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలకు వెళ్తున్నానని చెప్పి, అక్కడికి వెళ్లలేదు. ఆ తర్వాతి నుంచి ఆచూకీ లేకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. నాగచరణ్ తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ లింగయ్య కేసు నమోదు చేశారు.

యువతి..

పాల్వంచరూరల్: యువతి కనిపించకుండా పోయిన ఘటనపై స్థానిక పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. మండలంలోని పునుకుల గ్రామానికి చెందిన యువతి హైదరాబాద్‌లో చదువుతోంది. తల్లిదండ్రులు చేను వద్దకు వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి యువతి కనిపించకుండాపోయింది. దీంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

కొత్తగూడెంటౌన్: అసభ్యకరమైన మెసేజీలతో వివాహితను వేధింపులకు గురి చేసిన యువకుడిపై కొత్తగూడెం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. కొత్తగూడెంకి చెందిన ఓ వివాహితకు ఇన్‌స్ట్రాగామ్ ద్వారా ఓ యువకుడు వేర్వేరు ఐడీల నుంచి రిక్వెస్ట్ పంపాడు. అంతేకాకుండా సదరు మహిళకు అసభ్యకరమైన మేసేజ్‌లు పంపాడు. దీంతో బాధితురాలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణచేసి, బాబూక్యాంప్ ఏరియాకు చెందిన బండ మనోజ్‌కుమార్‌గా గుర్తించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అశ్వాపురం: మండలంలోని అమెర్ద డబుల్ బెడ్‌రూం నివాసంలో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. పాల్వంచకు చెందిన నరేశ్.. అత్తగారి ఊరైన అమెర్ద వచ్చాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో మనస్తాపంతో నరేశ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. గుర్తించిన బంధువులు, స్థానికులు మంటలు ఆర్పి నరేశ్‌ను 108లో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

సంక్రాంతి బరిలో పందెం కోళ్లు

సరిహద్దు మండలాల్లో జోరుగా పందేలు

- పండుగ సంబురం ఓ పక్క... జూదం ఇంకో పక్క
- ఆంక్షలు ఉన్నా... రూ.లక్షల్లో బెట్టింగ్
- పోలీసులు నిఘా పెంచాలని ప్రజల విజ్ఞప్తి



గత ఏడాది జిల్లా సరిహద్దుల్లో జరిగిన పందెంలో తలపడుతున్న కోళ్లు (ఫైల్)

కొత్తగూడెంటౌన్: అరే నా కోడి కేక.. కాదు నా కోడే కేక.. పెట్టు పందేం, చూద్దాం గెలుపెవరిదో.. అంటూ రెండు వర్గాలకు చెందిన పందెంరాయుళ్లు పోటీ పెంచుతున్నారు. తెలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో సంక్రాంతికి ముందుగానే పందేల హడావుడి ప్రారంభమైంది. సరదా కోసం వేసే పందేలు కాస్త బెట్టింగ్‌కు దారి తీయడంతో పలువురు రూ.లక్షల్లో నష్టపోతున్నారు. ఏపీకి సరిహద్దుగా ఉన్న ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఏటా పందేలు ఆనవాయితీగా కొనసాగుతున్నాయి. కొన్నిసార్లు పోలీసులకు పట్టుబడుతున్నా జూదం మాత్రం ఆగడం లేదు. అయితే, కొన్నిచోట్ల పోలీసుల సహకారం కూడా ఉంటోందనే విమర్శలున్నాయి.

ఇక్కడే ప్రధానం..

అశ్వారావుపేట మండలంలోని అశ్వారావుపేట, తిరుమలకుంట, వినాయకపురం, జమ్మిగూడెం, నారంవారిగూడెం, వడ్లగూడెం, సత్తుపల్లి మండలంలోని మేడిశెట్టివారి పాలెం, పెనుబల్లి, చంద్రుగొండ, ములకలపల్లి, భద్రాచలం, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల శివారు గ్రామాల్లో కోడి పందేలను నిర్వహిస్తున్నారు. సంక్రాంతి పండుగకు పది రోజులుగా ముందుగానే పందేలు మొదలుకావడంతో నానాటికీ రద్దీ పెరుగుతోంది. పోలీసులు తనిఖీల్లో పట్టుబడినప్పటికీ నిర్వాహకులు తీరు మార్చుకోవడం లేదు. సరదాగా పందేలకు వెళ్తున్న వారు నిర్వాహకుల మాయమాటలు నమ్మి రూ.లక్షల్లో బెట్టింగ్ కాసి నష్టపోతున్నారని తెలుస్తోంది.

గస్తీకి యువకుల ఏర్పాటు

పోలీసులకు తెలియకుండా గ్రామ శివారు, అటవీ ప్రాంతాలు, ఆయిల్ పామ్ తోటల్లో ఎక్కువగా పందెం కోసం బరులు ఏర్పాటు చేస్తారు. ఒకవేళ పోలీసులు వచ్చినా సమాచారం ఇచ్చేందుకు వీలుగా యువకులను నియమించి రోజుకు రూ.వెయ్యికి పైగా చెల్లిస్తారని సమాచారం.

ముందే ప్రణాళిక

ఉమ్మడి ఖమ్మం నుంచే కాకుండా తెలంగాణలోని పలు జిల్లాల నుంచి ఏటా సంక్రాంతికి ఇక్కడ పందేలు జరుగుతున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, సహచర ఉద్యోగులతో కలిసి వచ్చి పందేల్లో పాల్గొంటున్నారని సమాచారం. అయితే, కొందరు సరదా కోసం వస్తున్నా.. ఎక్కువ మంది మాత్రం కోడిపందేలను జూదంగానే చూస్తున్నారని సమాచారం.

పందెం నిర్వహించినా, పాల్గొన్నా చర్యలు



సంక్రాంతి పండుగను సరదాగా జరుపుకోవాలి. ఎక్కడైనా కోడిపందేలు నిర్వహించినట్లు తెలిస్తే బాధ్యులపై కఠినంగా వ్యవహరిస్తారు. అలాగే, పందెం చూడడానికి, బెట్టింగ్ కాయడానికి కూడా ఎవరూ వెళ్లొద్దు. తద్వారా డబ్బు కోల్పోవడమే తప్ప లాభముండదని గుర్తించాలి.

– అబ్దుల్ రెహమాన్, డీఎస్పీ కొత్తగూడెం

ఆటోను ఢీకొట్టిన కారు



ప్రమాదానికి కారణమైన కారు



ప్రమాదం వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

జూలూరుపాడు: మండలంలోని సాయిరాంతండా – జూలూరుపాడు మధ్య శుక్రవారం రాత్రి ఆటోని కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న దంపతులతోపాటు వారి ఇద్దరు పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం నాయకన్‌గూడెం గ్రామానికి చెందిన వీరబాబు తన ఆటోలో భార్య విజయశ్రీ, ఇద్దరు పిల్లలతో మణుగూరు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో సాయిరాంతండా గ్రామం దాటిన తరువాత ఎదురుగా వస్తున్న కారు వీరి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయశ్రీకి చెయ్యి విరగగా వీరబాబు తలకు గాయమైంది. ఇద్దరు పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి. అయితే, కారు నడుపుతున్న డ్రైవర్, అందులో ప్రయాణిస్తున్నవారంతా ఘటనాస్థలం నుంచి పారిపోయారు. ప్రమాదానికి కారణమైన కారు జూలూరుపాడు మండలం వెంగన్నపాలెంనకు చెందినదని తెలిసింది. క్షతగాత్రులను 108 వాహనంలో స్థానికులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. ఆటోని కారు ఎదురుగా వచ్చి ఢీకొన్నదా? లేదా వెనుక నుంచి ఢీకొట్టిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. కాగా, అటుగా వెళ్తున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ ఘటనా స్థలం వద్ద ఆగి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ముష్టి గింజల పట్టివేత

వదిలేసిన అటవీ అధికారులు..?

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గురువారం అర్ధరాత్రి పట్టణ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న క్రమంలో బొలేరోలో అక్రమంగా తరలిస్తున్న ముష్టి గింజలను పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని కరకగూడెం మండలం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ముష్టిగింజలను భారీగా తరలిస్తున్నారనే అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని స్థానిక ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు. కాగా, ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించగా ఫారెస్ట్ అధికారులు వాహనాన్ని వదిలేసినట్లు తెలుస్తోంది. పోలీసులు మాత్రం ఫారెస్ట్ అధికారులకు అప్పగించామని చెబుతుండగా వారు నోరు మెదపకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. నిదింతులు ఫారెస్ట్ అధికారులకు ముడుపులు భారీగా ముట్టచెప్పడంతో వదిలేసినట్లు పట్టణంలో ప్రచారం జరుగుతోంది. స్థానిక ఫారెస్ట్ రేంజ్ అధికారిణిని ఫోన్‌లో వివరణ కోరేందుకు యత్నించగా ఆమె స్పందించలేదు.

జూదరులపై కేసు

దమ్మపేట: మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులోని అరటి తోటలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు అందింది. ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో కలిసి పేకాట శిబిరంపై దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.4,140 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

బీజాపూర్ జిల్లాలో ఎదురుకాల్పులు

మావోయిస్టు పార్టీ జన్ మిలీషియా కమాండర్ మృతి

చర్ల: సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో శుక్రవారం మధ్యాహ్నం మావోయిస్టులకు, బలగాలకు ఎదురుకాల్పులు జరగగా మావోయిస్టు పార్టీ జన్‌మిలీషియా కమాండర్ మృతి చెందాడు. బీజాపూర్ జిల్లాలోని గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పూస్నార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ గంగులూరు ఏరియా కమిటీ కార్యదర్శి దినేశ్ మొడియంతో పాటు 20 నుంచి 25 మంది మావోయిస్టులు సంచరిస్తున్నారన్న నిఘా వర్గాల సమాచారంతో బీజాపూర్, దంతెవాడ జిల్లాలకు చెందిన డీఆర్‌జీ, కోబ్రా, 85వ బెటాలియన్ బలగాలు పూస్నార్ అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పూస్నార అటవీ ప్రాంతంలో తారసపడిన మావోయిస్టులు బలగాల పైకి కాల్పులు జరపడంతో వీరు కూడా ఎదురుకాల్పులు జరిపారు. హోరాహోరీగా సాగిన ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ జన్ మిలీషియా కమాండర్ తోయా పొటెం మృతి చెందాడు. మిగిలిన మావోయిస్టులు అక్కడి నుంచి తప్పించుకొని పారిపోగా ఆ ప్రాంతంలో విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రి, నిత్యావసర వస్తువులు లభ్యం కావడంతో పోలీసులు వాటిని స్వాధీనం చేసుకొని మృతదేహాన్ని బీజాపూర్ జిల్లా కేంద్రానికి తరలించారు. మృతి చెందిన మావోయిస్టుపై ఛత్తీస్‌గఢ్ పోలీసు శాఖ రూ.లక్ష రివార్డు ప్రకటించింది.

ట్రాక్టర్ బోల్తా పడి మహిళ మృతి



ఈసం రమణ మృతదేహం

గుండాల: మొక్కజొన్న కంకులు మిల్లు పట్టేందుకు వెళ్తున్న ట్రాక్టర్ (మిల్లర్) బోల్తా బడి ఓ మహిళ మృతి చెందిన ఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని శంభునిగూడెం పంచాయతీ పరిధి కొరకలమడుగు గ్రామానికి చెందిన ఈసం రమణ (37) మొక్కజొన్న కంకులు మిల్లు పట్టేందుకు ట్రాక్టర్‌తో పాటు నడుచుకుంటూ వెళ్తోంది. అక్కడ రోడ్డంతా గుంతలుపడి ఉండటంతో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే నడుస్తున్న రమణపై పడటంతో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సీఐ రవీందర్, కాచనపల్లి ఎస్ఐ గిరిధర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



ఆదినారాయణ మృతదేహం

మణుగూరురూరల్: చేపల వేట కోసం వెళ్లిన ఓ వ్యక్తి చెరువులో ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. మండలంలోని పగిడేరు గ్రామానికి చెందిన సున్నం ఆదినారాయణ (34) శుక్రవారం సాంబాయిగూడెం గ్రామపంచాయతీలోని పేరంటాల చెరువుకు చేపలవేట కోసం వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గమనించిన స్థానిక ఈతగాళ్లు చెరువులో పడిన ఆదినారాయణను బయటకు తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

గాయపడిన వ్యక్తి...

బూర్గంపాడు: మండల కేంద్రానికి సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. పశ్చిమ గోదావరి జిల్లా కుక్కునూరు మండలం సీతారామనగరం గ్రామానికి చెందిన మడిపల్లి వెంకటేశ్వర్లు (27) గురువారం తన మోటార్‌సైకిల్‌పై బూర్గంపాడు వచ్చి, పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరుగు పయనమయ్యాడు. బూర్గంపాడు కొల్లుచెరువు ప్రాంతంలో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లును భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించగా శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న వివాహిత...



అంజలి (ఫైల్)

పాల్వంచరూరల్: కడుపునొప్పి తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. పోలీసుల కథనం ప్రకారం.. కేశవాపురం గ్రామానికి చెందిన మాలోత్ అంజలి (20)కి నాలుగు రోజులు కిందట కడుపునొప్పి రావడంతో తట్టుకోలేక పురుగులమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పాల్వంచ ఏరియాస్పత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతిచెందింది. మృతురాలి తండ్రి మోహన్ శుక్రవారం ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ సుధాకర్ కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త ప్రశాంత్, ఏడాదిన్నర బాబు ఉన్నాడు.

గంజాయి స్వాధీనం



పట్టుకున్న గంజాయిని తూకం వేస్తున్న ఎస్ఐ రాము

పాల్వంచ: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్టాండ్‌లో పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఆర్టీసీ బస్టాండ్‌లో పట్టణ ఎస్ఐ బి.రాము తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఓ వ్యక్తి కనిపించడంతో అదుపులోకి తీసుకుని, బ్యాగ్‌ను తనిఖీ చేశారు. బ్యాగ్‌లో 5.3 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా కలాపూర్ కమలానగర్ కాగా హైదరాబాద్‌లోని నాంపల్లి బేగంబజార్‌లో నివాసం ఉంటూ ఎలక్ట్రికల్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. గంజాయిని ఒడిశా రాష్ట్రం మల్కన్‌గిరిలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. కానిస్టేబుళ్లు వీవీ కృష్ణారావు, వేణు, ఈర్య పాల్గొన్నారు.

మూడు కిలోల గంజాయి..

నేలకొండపల్లి: గంజాయి తరలిస్తున్న యువకుడిని శుక్రవారం నేలకొండపల్లి ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి జిల్లాకు చెందిన ఓ యువకుడు శుక్రవారం గంజాయితో వస్తున్నాడని ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం వద్ద మాటు వేసి యువకుడిని అదుపులోకి తీసుకుని మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. కాగా, ఈ విషయాన్ని ఎక్సైజ్ పోలీసులు గోప్యంగా ఉంచారు. ఈ విషయమై సీఐ కుమ్మరి పోశెట్టి వివరణ కోసం యత్నించగా అందుబాటులోకి రాలేదు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

దుమ్ముగూడెం: మండలంలోని రేగుంట గ్రామానికి చెందిన ఎనిమిదేళ్ల బాలుడు పాయం రవిత్య కుక్కల దాడిలో గాయపడ్డాడు. ఈ ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన రవిత్య, తన అక్కతో కలిసి ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. వెంటనే బాలుడి అక్కడ పాలం వద్దకు పరుగెత్తి తల్లిదండ్రులకు విషం చెప్పడంతో వారు వచ్చి కుక్కలను తరిమేశారు. గాయపడిన బాలుడిని ములకపాడు వైద్యశాలకు తరలించారు.

బొగ్గు టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి

కొత్తగూడెంటౌన్: రోడ్డు దాటుతున్న వ్యక్తిని బొగ్గు టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం శుక్రవారం రాత్రి కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలో చోటు చేసుకుంది. చంద్రుగొండ మండలం మద్దునూరు కిష్టారానికి చెందిన తరుణ్ చౌదరి(45) కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్ వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఇదేసమయాన కొత్తగూడెం బస్టాండ్ వైపు వెళ్తున్న బొగ్గు టిప్పర్ ఢీకొట్టి ఆయన పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు.

వరిగడ్డి దగ్ధం

చంద్రుగొండ: వరిగడ్డి లోడుతో వస్తున్న ట్రాక్టర్ వస్తుండగా విద్యుత్ తీగలు తగలడంతో గడ్డి దగ్ధమైన ఘటన శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీనగర్‌కాలనీలో చోటుచేసుకుంది. తిప్పనపల్లి గ్రామానికి చెందిన రైతు పోతురాజు ఆదినారాయణ చంద్రుగొండ నుంచి వరిగడ్డిని తన ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నాడు. శ్రీనగర్‌కాలనీలో కరెంట్‌వైర్లకు గడ్డి తగలడంతో మంటలు చెలరేగి వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ట్రాక్టర్ ట్రక్కుకు పాక్షికంగా నష్టం వాటిల్లింది.

ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు ఎంపిక



అదనపు కలెక్టర్‌తో విద్యార్థులు, విద్యాశాఖ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: ఈ నెల 17 నుంచి 20వ తేదీ వరకు హరియాణాలోని ఫరీదాబాద్‌లో జరిగే ఇండియా ఇంటర్నేషనల్ సైన్స్ ఫెస్టివల్‌కు జిల్లా విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారు. శుక్రవారం వారిని జిల్లా అదనపు కలెక్టర్ పర్సా రాంబాబు, జిల్లా విద్యాధికారి ఎం.వెంకటేశ్వరాచారి అభినందించి మాట్లాడారు. విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. 'సైన్స్ అండ్ టెక్నాలజీ పబ్లిక్ అవుట్ రిచ్ ఇన్ అమృత్‌కాల్' ప్రధానాంశంగా ఈ ఫెస్టివల్ జరుగుతుందని తెలిపారు. రాష్ట్రం నుంచి మొత్తం 20 మందిని ఎంపిక చేయగా, అందులో మన జిల్లా నుంచే ఏడుగురు ఉన్నారని పేర్కొన్నారు. సైన్స్ ఫెస్టివల్‌కు జాతీయ, అంతర్జాతీయ ఇన్నోవేటర్లు, సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు హాజరవుతారని తెలిపారు. వారు విద్యార్థులతో ఇంటరాక్ట్ అవుతారని, కొత్త ఆవిష్కరణలు, పరిశోధనాంశాలు, జాయ్‌ఫుల్ లెర్నింగ్, శాస్త్రం పట్ల అవగాహన తదితర అంశాలు చర్చించే అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులతోపాటు జిల్లా సైన్స్ ఆఫీసర్ ఎస్.చలపతిరాజు, ఇల్లెందు ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులు ఎం.పార్వతి హాజరవుతారని వివరించారు.

నైపుణ్యం వెలికితీసేందుకే 'ప్రజ్ఞా' పోటీలు



మాట్లాడుతున్న సిద్ధార్థ మొహంతి

బూర్గంపాడు: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల నైపుణ్యాలను వెలికితీసేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో ప్రజ్ఞా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీసీ పీఎస్‌పీడీ యూనిట్‌హెడ్ సిద్ధార్థ మొహంతి తెలిపారు. సారపాకలోని ఐటీసీ కళాభారతిలో శుక్రవారం ప్రజ్ఞా –2024 పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రోటరీ క్లబ్ ప్రతినిధులు శైలేష్, అశోక్,జయంత్‌కుమార్ దాస్, కేవీఎస్ గోవిందరావు, ఐటీసీ ఉన్నతాధికారులు రాజశేఖర్, భాస్కరరావు, రాంబాబు, చెంగలరావు, డీవీఎం నాయుడు, ప్రఫుల్ల, యాగి చంద్రశేఖర్, కిషోర్‌కుమార్, నీలి మురళి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన కారు



ఇల్లెందురూరల్: మండలంలోని లలితాపురం గ్రామం వద్ద శుక్రవారం ఓ కారు అదుపుతప్పి చెట్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఖమ్మం జిల్లా కారేపల్లి మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన రాంబాబు ఇల్లెందు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో రాంబాబు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

హైదరాబాద్‌లో జిల్లా వాసి ఆత్మహత్య



జగదీశ్ (ఫైల్)

దుమ్ముగూడెం: మండలంలోని పెద్దనల్లబల్లి గ్రామానికి చెందిన బోడపట్ల జగదీశ్ (25) హైదరాబాద్‌లోని తన రూంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జగదీశ్ బీటెక్ పూర్తి చేసి హైదరాబాద్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. నలుగురు స్నేహితులతో కలిసి రూంలో ఉంటున్నాడు. గురువారం రాత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పండక్కి ఇంటికి వస్తానని చెప్పాడని తెలిసింది. తెల్లారేసరికి జగదీశ్ ఉరివేసుకుని మృతిచెందాడని తోటి స్నేహితులు ఫోన్‌లో సమాచారం అందించడంతో తల్లిదండ్రులు కుప్పకూలిపోయారు. వెంటనే హైదరాబాద్‌కు బయలుదేరారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అత్యాచారం, హత్య కేసులో జైళ్ల శాఖ డీఐజీ విచారణ

నిందితుడి పుట్టినతేదీ రికార్డులు పరిశీలన

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను శుక్రవారం జైళ్ల శాఖ వరంగల్ డీఐజీ ఎం.సంపత్ పరిశీలించారు. అన్నారుగూడెంకు చెందిన పులి రామారావు 1996లో బాలికపై హత్యాచారం, హత్య చేశాడు. ఈ కేసులో రామారావు ప్రస్తుతం జైలులో ఉన్నాడు. అయితే, ఘటన జరిగిన సమయాన తన కుమారుడు మైనర్ అయినందున క్షమాభిక్ష ప్రకటించాలని రామారావు తల్లి హైకోర్టును ఆశ్రయించింది. దీంతో రామారావు చదివిన పాఠశాలలో పుట్టిన తేదీ వివరాలు పరిశీలించేందుకు డీఐజీ వచ్చారు. అలాగే, 2012లో తహసీల్ నుంచి కూడా పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం జారీ అయిన నేపథ్యాన కార్యాలయానికి కూడా వెళ్లి రికార్డులు పరిశీలించారు. ఆతర్వాత స్థానిక పోలీస్ స్టేషన్‌ను కూడా ఆయన సందర్శించారు.

యావజ్జీవం తప్పదు!



ఏ లెక్కన చూసినా శిక్ష నుంచి చంద్రబాబు తప్పించుకోలేరు

- చుట్టుముట్టిన స్కిల్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఐఆర్ఆర్, లిక్కర్, ఇసుక స్కాంలు
- అన్ని కుంభకోణాల ప్రధాన కుట్రదారు, లబ్ధిదారు ఆయనే
- సెక్షన్ 409 కింద ఒక్కో కేసులో యావజ్జీవ ఖైదుకు అవకాశం
- అవినీతి నిరోధక చట్టం కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు
- అయినా ముందస్తు బెయిల్‌ను వక్రీకరిస్తున్న ఎల్లో మీడియా

ఆరు కేసుల్లోనూ శిక్ష తప్పదు

చంద్రబాబుపై ఐపీసీ సెక్షన్లు 120(బి), 166, 167, 418, 420, 465, 468, 471, 477(ఎ), 409, 201, 109 రెడ్‌విత్ 34, 37లతోపాటు అవినీతి నిరోధక చట్టం 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద అభియోగాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీటిలో అత్యంత కీలకమైనవది సెక్షన్ 409. ఆ సెక్షన్ కింద నేరం నిరూపితమైతే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. అవినీతి నిరోధక చట్టంలోని 13(2) రెడ్‌విత్ 13(1), (సి), (డి) కింద నేరం నిరూపితమైతే గరిష్టంగా పదేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక ఇతర సెక్షన్లు సరేసరి. ఈ ఆరు కేసుల్లో తీర్పులు వేర్వేరుగా వస్తాయి. నేరం నిరూపితమై శిక్షలు పడితే చంద్రబాబు వేర్వేరుగా శిక్షలు అనుభవించాల్సి వస్తుంది. ఇప్పటికే చంద్రబాబుకు 73 ఏళ్లు నిండుతున్నాయి. ఈ నేపథ్యంలో ఓసారి నేరం నిరూపితమై ఒక్కో కేసులో ఐపీసీ 409 సెక్షన్ కింద యావజ్జీవ కారాగార శిక్ష, అవినీతి నిరోధక చట్టం 13(2) కింద గరిష్టంగా పదేళ్ల కారాగార శిక్ష పడితే తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఇన్నర్ రింగ్ రోడ్, అసైన్డ్ భూముల కేసుల్లో లోకేశ్ కూడా నిందితుడిగా ఉన్నారు. నారాయణతోపాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా ఉన్నారు. వారంతా శిక్ష అనుభవించాల్సిందేనని నిపుణులు తేల్చి చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఉంటూ అవినీతికి పాల్పడిన కేసుల్లో హర్యానా మాజీ సీఎం ఓమ్ ప్రకాశ్ చౌతాలకు 16 ఏళ్ల తర్వాత జైలు శిక్ష పడిన ఉదంతాన్ని ఉదాహరిస్తున్నారు. తాజాగా తమిళనాడులో మంత్రిగా చేసిన సెంథిల్ బాలాజీ, మద్యం కేసుల్లో ఢిల్లీ మాజీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాకు ఇప్పటికీ బెయిల్ రాకపోవడాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు.

'చంద్రబాబు శాశ్వతంగా జైలు పక్షిగా మారక తప్పదు. ఒకట్రెండ్రోజులు ఆలస్యం కావచ్చు తప్ప, యావజ్జీవ కారాగార శిక్ష మాత్రం పక్కా'అని న్యాయ నిపుణులు తేల్చి చెబుతున్నారు. ఐపీసీ 409 సెక్షన్ కింద ఒక్కో కేసులో విడివిడిగా యావజ్జీవ కారాగార శిక్ష, పీసీ యాక్ట్ 13(బి) కింద ఒక్కో కేసులో గరిష్టంగా పదేళ్ల జైలు శిక్ష పడే అవకాశాలున్నాయని ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

గత టీడీపీ ప్రభుత్వంలో బరితెగించి నిబంధనలను ఉల్లంఘించి, యథేచ్ఛగా అవినీతికి పాల్పడిన చంద్రబాబు బాగోతం కట్టలు కట్టలుగా బయట పడుతోంది. భారీ అవినీతి కుంభకోణాల కుట్రదారు, లబ్ధిదారులు చంద్రబాబు, ఆయన కుటుంబం, సన్నిహితులు, బినామీలేనని డాక్యుమెంటరీ ఆధారాలు, న్యాయ స్థానాల్లో నమోదు చేసిన కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబుపై అభియోగాలతో ఏకీభవిస్తూ ఏసీబీ న్యాయస్థానం జ్యుడిషియల్ రిమాండ్ విధించడాన్ని బట్టి చూస్తుంటే.. ఈ ఒక్క కేసు చాలు చంద్రబాబుకు యావజ్జీవ శిక్ష పడటానికి అని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. స్కిల్ స్కామ్ కేసులో బెయిల్ ఇస్తున్నప్పుడు గానీ.. తాజాగా మూడు కేసుల్లో హైకోర్టు ఇచ్చిన ముందస్తు బెయిల్ సందర్భంగా గానీ చంద్రబాబు అవినీతి చేయలేదని ఎక్కడా చెప్పలేదన్న విషయాన్ని నొక్కి వక్కాణిస్తున్నారు.

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో స్కిల్ కార్పొరేషన్, ఫైబర్‌నెట్, అసైన్డ్ భూములు, ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాలకు కర్త, కర్మ, క్రియ గత ముఖ్యమంత్రి చంద్రబాబే అని సీఐడీ దర్యాప్తులో పూర్తి ఆధారాలతో వెల్లడి కావడంతో ఆయనకు ఏ రకంగా చూసినా జీవిత ఖైదు తప్పదని న్యాయ నిపుణులు బల్ల గుద్ది చెబుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలోనే ఆయన సర్వం తానై కుట్ర పన్నారు. అందుకోసం కేబినెట్‌కు తెలియకుండా చీకటి జీవోలు జారీ చేశారు. స్కిల్ ప్రాజెక్ట్, ఫైబర్ నెట్, బినామీల పేరుతో అసైన్డ్ భూములు పొందిన వారికి భూ సమీకరణ ప్యాకేజీ, మద్యం కొనుగోళ్లపై ప్రివిలేజ్ పన్ను.. జీఎస్టీ ఎత్తివేత, ఉచిత ఇసుక విధానం.. ఇలా అన్ని కుంభకోణాలకు మార్గం సుగమం చేసేందుకు గత టీడీపీ ప్రభుత్వం వేర్వేరు జీవోలను జారీ చేసింది. ఆ జీవోకు కూడా కేబినెట్ ఆమోదం లేకపోవడం చంద్రబాబు కుట్రను వెల్లడిస్తోంది. ఆ జీవోలకు సంబంధించిన నోట్ ఫైళ్లను కూడా మాయం చేయడం గమనార్హం. మాయం చేసిన నోట్ ఫైళ్లను సీఐడీ అధికారులు రిట్రీవ్ చేసి వెలుగులోకి తేవడంతో అన్ని కుంభకోణాల కుట్రలకు కీలక ఆధారాలు లభించాయి. చంద్రబాబు ముఠా గల్లంతు చేసిన అమరావతిలో అసైన్డ్ భూముల రికార్డులను సీఐడీ వెలికి తీసింది. స్కిల్ స్కామ్, ఫైబర్ నెట్ స్కామ్‌లలో కొల్లగొట్టిన నిధులు చంద్రబాబు నివాసానికే చేర్చిన అవినీతి నెట్‌వర్క్‌ను బ్యాంకు ఖాతాల వివరాలతోసహా ఛేదించింది. ఇన్నర్ రింగ్ రోడ్ అలైన్‌మెంట్ మార్పులు, క్విడ్ ప్రో కో కింద చంద్రబాబు కరకట్ట నివాసం పొందడం, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు దక్కడం, చంద్రబాబు, నారాయణ బినామీల పేరిట భూ సమీకరణ ప్యాకేజీ పొందడం మొదలైనవన్నీ రికార్డులతో సహా వెలుగులోకి వచ్చాయి. ఈ విధంగా చంద్రబాబు, లోకేశ్, నారాయణల పాత్రను స్పష్టం చేస్తూ పూర్తి డాక్యుమెంటరీ ఆధారాలు లభించాయి. మరోవైపు ఈ కుంభకోణాలంటికీ సూత్రధారి చంద్రబాబే అని కీలక సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారు. అది కూడా 164 సీఆర్‌సీపీ కింద న్యాయస్థానంలో వాంగ్మూలాలు నమోదు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేయడం చట్ట విరుద్ధమని చెప్పినప్పటికీ చంద్రబాబు పట్టించుకోలేదని అప్పటి సీఆర్‌డీఏ ముఖ్య కార్యదర్శి, కమిషనర్, గుంటూరు జిల్లా కలెక్టర్ వాంగ్మూలాలు ఇచ్చారు. ఫైబర్‌నెట్, స్కిల్ స్కామ్‌లలో నిబంధనలకు విరుద్ధంగా నిధులు మంజూరు చేయొద్దని చెప్పినా చంద్రబాబు పట్టించుకోలేదని కీలక అధికారుల వాంగ్మూలాలు నమోదు చేశారు. షెల్ కంపెనీల ప్రతినిధులు కూడా అప్రూవర్‌గా మారి అదే విషయాన్ని చెప్పారు. ఇన్నర్ రింగ్ రోడ్ కేసులో కన్సల్టెన్సీ కంపెనీ, స్కిల్ స్కామ్‌కు సంబంధించి సీమెన్స్ కంపెనీ కూడా 164 సీఆర్‌సీపీ కింద వాంగ్మూలాలు నమోదు చేశాయి. అన్ని కుంభకోణాల్లో చంద్రబాబు ప్రధాన కుట్రదారు, ప్రధాన లబ్ధిదారు అనేదానికి అటు డాక్యుమెంటరీ ఆధారాలు, ఇటు కీలక సాక్షుల వాంగ్మూలాలు స్పష్టం చేస్తున్నాయి.

రిమాండ్‌కు పంపడమే తార్కాణం

చంద్రబాబు పాల్పడ్డ ఇన్ని కుంభకోణాలలో ఒక్క స్కిల్ స్కామ్‌ను పరిశీలిస్తే చాలు.. ఆయన అవినీతి బాగోతం తెలిసిపోతోంది. సీఐడీ పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి చంద్రబాబును అరెస్ట్ చేసిన అనంతరం విజయవాడ ఏసీబీ న్యాయ స్థానంలో హాజరు పరిచింది. ఆ సందర్భంగా దాదాపు 10 గంటలపాటు ఇరుపక్షాల వాదనలను విన్న తర్వాత ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించాలని న్యాయమూర్తి ఆదేశించారు. దాంతోనే చంద్రబాబు 52 రోజులపాటు రిమాండ్ ఖైదీగా ఉన్నారు. అనంతరం అనారోగ్య కారణాలతోనే ఆయనకు బెయిల్ మంజూరు చేశారు.

ముందస్తు బెయిల్‌పై ఎల్లో మీడియా వక్రీకరణ

ఇన్నర్ రింగ్ రోడ్, మద్యం, ఇసుక కుంభకోణాల కేసుల్లో చంద్రబాబుకు హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. కానీ ఆ సందర్భంగా కూడా ఆయన అవినీతికి ఆధారాలు లేవని న్యాయస్థానం చెప్ప లేదు. కేసు పూర్వాపరాల్లోకి ఇంకా తాము వెళ్లడం లేదని కూడా స్పష్టం చేసింది. కేవలం షరతులతోనే ముందస్తు బెయిల్ మంజూరు చేస్తున్నట్టు ప్రకటించింది. విచారణకు చంద్రబాబు సహకరించాలని.. విచారణకు పిలిస్తే వెళ్లాలని కూడా చెప్పింది. కానీ హైకోర్టు తీర్పుకు వక్రభాష్యం చెబుతూ చంద్రబాబుకు క్లీన్ చిట్ లభించినట్టుగా ఈనాడు, ఇతర ఎల్లో మీడియా హడావుడి చేయడం విస్మయ పరుస్తోంది. సీఐడీ సేకరించిన ఆధారాలతో నేరం రుజువు కావడం ఖాయమని న్యాయ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నేరం నిరూపితమైన తర్వాత ఒక్కో కేసులో చంద్రబాబుకు యావజ్జీవ జైలు శిక్ష పడుతుందని కూడా తేల్చి చెబుతున్నారు.

'స్కిల్డ్' క్రిమినల్ చంద్రబాబే..!

స్కిల్ స్కామ్ కుట్రదారు, లబ్ధిదారు ఆయనే

- సీమెన్స్ ముసుగులో ప్రజాధనం లూటీ
- జర్మనీ కంపెనీకి తెలియకుండానే ప్రాజెక్టు
- రూ.370 కోట్ల ప్రాజెక్ట్ ఏకంగా రూ.3,300 కోట్లకు పెంపు
- తన ముఠాను మోహరించి నిధుల స్వాహా
- అధికారుల అభ్యంతరాలు బేఖాతరు చేస్తూ నిధుల విడుదల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

పై కేసుల్లో నిందితులు వీరే

- నారా చంద్రబాబునాయుడు
- నారా లోకేశ్
- పొంగూరు నారాయణ
- కింజరాపు అచ్చెన్నాయుడు
- దేవినేని ఉమామహేశ్వరరావు
- కొల్లు రవీంద్ర
- పీతల సుజాత
- చింతమనేని ప్రభాకర్

చంద్రబాబు, లోకేశ్ దొంగలు



- కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారు
- ఎన్నికల ముందు మేమే రూ.150 కోట్లు ఇచ్చాం
- టీడీపీ 75 శాతం పూర్తి చేసిందనేది పచ్చి అబద్ధం
- ఆ పార్టీ ప్రజల కోసం కాదు... కుటుంబం కోసమే
- లోకేశ్ రాయలసీమలో ఎందుకు పోటీ చెయ్యడు?
- ఈ పార్టీలో ఉండలేను... రాజీనామా చేస్తున్నా
- చంద్రబాబు ఫొటో నేలకేసి కొట్టిన రాయపాటి రంగారావు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు, ఆయన కొడుకు లోకేశ్ దొంగలని, ఆ పార్టీ ఓ దిక్కుమాలిన పార్టీ అని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు కుమారుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి రాయపాటి రంగారావు చెప్పారు. ఆయన శుక్రవారం ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు, లోకేశ్ ధన దాహానికి తమ కుటుంబం సర్వనాశనం అయిపోయిందని తెలిపారు. చంద్రబాబు, లోకేశ్‌కు డబ్బే ముఖ్యమని, మరేమీ అవసరం లేదని అన్నారు. ఇక టీడీపీలో ఉండలేనని స్పష్టం చేశారు. పార్టీకీ, పదవికి రాజీనామ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ వెంటనే తన కార్యాలయంలో ఉన్న చంద్రబాబు ఫొటోను నేలకేసి కొట్టి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 2014లో రాష్ట్రం విడిపోయినప్పుడు కాంగ్రెస్‌కు రాజీనామా చేసి టీడీపీలో చేరిన తాము ఆ పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేశామన్నారు. గత ఎన్నికలకు ముందు తమ నుంచి రూ. 150 కోట్లు తీసుకున్నారని తెలిపారు. లోకేశ్, చంద్రబాబునాయుడు ఎంతెంత తీసుకున్నారో తమ వద్ద లెక్కలున్నాయన్నారు. తండ్రి, కొడుకు ఒకరికి తెలియకుండా మరొకరు డబ్బులు తీసుకున్నారన్నారు. డబ్బులు తీసుకుని కూడా పోలవరం ప్రాజెక్టు విషయంలో తమను సర్వ నాశనం చేశారన్నారు. చంద్రబాబు కమీషన్ల కోసం పోలవరాన్ని వాడుకున్నారని చెప్పారు. సోమవారం పోలవారం అని చంద్రబాబు చెప్పడం ఉత్త బోగస్ అని అన్నారు. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరంపై సమీక్ష చేసింది కేవలం లంచాల కోసమేనని చెప్పారు. ప్రతి వారం డబ్బులు వసూలు చేశారని తెలిపారు. తమని హింసించి మరీ డబ్బులు వసూలు చేశారన్నారు. తమ ఆస్తులన్నీ బ్యాంకులో పెట్టుకున్నారని అన్నారు. డబ్బులు వాడుకుని మూడు సంవత్సరాల తర్వాత మమ్మల్ని ప్రాజెక్టు నుంచి తప్పించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పనులు 75 శాతం పూర్తి చేసినట్లుగా చంద్రబాబు చెబుతున్నది పచ్చి అబద్ధమని స్పష్టం చేశారు.

టీడీపీ ఫక్తు వ్యాపార సంస్థ

తెలుగుదేశం రాజకీయ పార్టీయే కాదని, ఫక్తు వ్యాపార సంస్థ అని ఆరోపించారు. ఆ పార్టీ ఉంది ప్రజల కోసం కాదని, కేవలం వాళ్లు బాగుపడటం కోసమేనని చెప్పారు. లక్ష ఉద్యోగాలు తెచ్చామని, శ్రీసిటీ కట్టించామన్నారని, కియా కంపెనీ తెచ్చామని చంద్రబాబు పచ్చి అబద్ధాలు చెప్పారన్నారు. కియా కంపెనీ తెస్తే అనంతపురంలో ఎందుకు ఓడిపోయారని అన్నారు. లోకేశ్ రాయలసీమలో కాకుండా మంగళగిరి ఎందుకొచ్చాడని ప్రశ్నించారు. లోకేశ్‌కు ధైర్యం ఉంటే రాయలసీమలో పోటీ చేయాలని సవాల్ చేశారు. మంగళగిరిలో లోకేశ్‌ను ఓడిస్తానని చెప్పారు. తమ కుటుంబం 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉందని, ఎవరినీ మోసం చేయలేదని తెలిపారు. తాను సత్తెనపల్లి సీటు అడిగినా, కన్నా లక్ష్మీనారాయణను నియమించారన్నారు. కన్నా నియామకంతో 83 ఏళ్ల తమ తండ్రి రాయపాటి సాంబశివరావు ఆవేదన చెందారన్నారు. 2014లో రాయపాటి సాంబశివరావు ఎంపీగా గెలిచాక కూడా టీడీపీలో అనేక అవమానాలు ఎదుర్కొన్నారని తెలిపారు. తామే కాదని, పార్టీని నమ్ముకున్న అనేకమంది అప్పుల్లో ఉన్నారని తెలిపారు. చనిపోయిన వారికి ఇన్సూరెన్స్ ఇస్తానని డబ్బులు వసూలు చేసిన లోకేశ్ ఎంతమందికి ఇచ్చారని నిలదీశారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో రాష్ట్ర ప్రజలను దోచుకున్నారని ఆరోపించారు. రెండు, మూడు లక్షల కోట్లు ఖర్చు చేశామన్నారని, ఆ డబ్బులు ఎక్కడ ఖర్చు పెట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు.

పేదల కోసం పని చేస్తున్న సీఎం వైఎస్ జగన్

ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పనిచేస్తున్నారని రంగారావు చెప్పారు. కోవిడ్ సమయంలో ప్రజలు ఇబ్బంది పడకూడదని సీఎం జగన్ ఒక సంవత్సరం బడ్జెట్ మొత్తం ఖర్చు పెట్టారని చెప్పారు. ఆ రెండేళ్ల ఆంధ్రప్రదేశ్ జీడీపీ ఎక్కువగా ఉందని రిజర్వ్ బ్యాంక్ వెబ్‌సైటే చెబుతోందని తెలిపారు. అదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు అందరికి అందుతున్నాయన్నారు. జగన్ అంటే తమకు ఇష్టమని, ఆయన సీటు ఇస్తే పోటీ చేస్తానని చెప్పారు.

జిల్లా వార్తలు

ముగిసిన జెన్‌కో ఫుట్‌బాల్, బాల్ బ్యాడ్మింటన్ టోర్నీ



ట్రోఫీ అందజేస్తున్న జెన్‌కో డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ: పాల్వంచలోని కేటీపీఎస్ కళాభారతి క్రీడామైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న టీఎస్ జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడాపోటీలు గురువారం రాత్రి ముగిశాయి. ఫుట్‌బాల్ టోర్నీలో కేటీపీఎస్ 5, 6వ దశలు ప్రథమ, కేటీపీఎస్ 7వ దశ ద్వితీయ, కేటీపీపీ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే, బాల్ బ్యాడ్మింటన్‌లో శ్రీశైలం ప్రథమ, కేటీపీపీ ద్వితీయ, కేటీపీఎస్ 7వ దశ తృతీయ స్థానాల్లో నిలవగా జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బి.లక్ష్మయ్య ట్రోఫీలు అందజేసి మాట్లాడారు. క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరిస్తూ ఉద్యోగులు జాతీయస్థాయిలోనూ సత్తా చాటాలని తెలిపారు. సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్‌రావు, శ్రీనివాసబాబు, స్పోర్ట్స్ ఆఫీసర్ ఎస్.లోహిత్‌ఆనంద్‌తో పాటు వై.వెంకటేశ్వర్లు, టి.వీరస్వామి, కె.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

మిరప తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



రైతులకు సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

ఖమ్మంవ్యవసాయం/కూసుమంచి: మిరప తోటలకు తెగుళ్లు ఆశించి దిగుబడి పడిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్న క్రమాన జిల్లాకు వచ్చిన శాస్త్రవేత్తల బృందం పర్యటన శుక్రవారం కూడా కొనసాగింది. కూసుమంచి మండలంలోని గోపాలరావుపేట, ముదిగొండ మండలం యడవల్లి, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడులో పలువురు రైతులు సాగు చేసిన మిర్చి తోటలను రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ, కేవీకే శాస్త్రవేత్తలు పరిశీలించా రు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వాతా వరణ మార్పులతో మిర్చిని తెగుళ్లు, చీడపీడలు వ్యాపించి దిగుబడి పడిపోతోందని తెలిపారు. ఈమేరకు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిచికారీ చేయాల్సిన మందులపై అవగాహన కల్పించారు. శాస్త్రవేత్తలు సురేష్‌రావు, రవికుమార్, శైలజతో పాటు ఉద్యాన, వ్యవసాయశాఖల డీడీలు వేణుగోపాల్, మోహన్‌రెడ్డి, డీఏఓ వవిజయనిర్మలతో పాటు ఉద్యోగులు విజయచంద్ర, వాణి, అపర్ణ పాల్గొన్నారు.

మహిళామణులకు మణిహారం



శిక్షణ పూర్తిచేసుకున్న వారితో సేవా సమితి బాధ్యులు

- టైలరింగ్, మగ్గం, బ్యూటీషియన్ కోర్సులు
- సింగరేణి సేవా సమితి ఆధ్వర్యాన ఉచిత శిక్షణ
- ఆపై ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధిస్తున్న అతివలు
- 2003 నుంచి నేటి వరకు 4,278 మందికి శిక్షణ



మహిళలు సిద్ధం చేసిన దుస్తులను పరిశీలిస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు వివిధ ఉపాధి రంగాల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఇల్లెందు సింగరేణి ఏరియా పరిధిలో 2003లో సేవాసమితి ఏర్పాటైంది. ఈ సమితి ద్వారా సింగరేణి ప్రభావిత గ్రామాల మహిళలు, యువతులు, ఉద్యోగులు, మాజీ ఉద్యోగుల పిల్లలకు వివిధ రంగాల్లో శిక్షణ ఇస్తుండగా ఉపాధి రంగాల్లో స్థిరపడుతున్నారు. ఇల్లెందు ఏరియా సేవా సమితి ద్వారా జేకే-5 ఓసీ కాలనీ, ఉసిరికాయలపల్లి, పోలంపల్లి, భాగ్యనగర్‌తండా, పూసపల్లి, గుండాల, కాచనపల్లి, మామాకన్ను, ఆళ్లపల్లి, కేసముద్రం, బాలాజీనగర్, సంజయ్‌నగర్, సీఎస్‌పీ బస్తీ, ఇందిరా నగర్, సుభాష్‌నగర్, తిలక్ నగర్, విజయలక్ష్మీనగర్, కొమురారం, రొంపేడు, రాఘబోయినగూడెం, సుదిమళ్ల, కోయగూడెం, ధారపాడు, పెట్రాంచెల్క, కొప్పురాయి, బోడు, లచ్చగూడెం, కిష్టారం, స్టేషన్ తడికెలపూడి తదితర గ్రామాల వారు ఇప్పటివరకు శిక్షణ పొందారు.

ఉచిత శిక్షణ ఇలా...

సింగరేణి సేవా సమితి ద్వారా 2023 సంవత్సరంలో మూడు కేటగిరీలుగా ఐదు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. టైలరింగ్ మూడు బ్యాచ్‌ల్లో 75 మంది, మగ్గంలో 25 మంది, బ్యూటీషియన్‌లో 25 మందికి సుశిక్షితులైన వారి మూడు నెలల పాటు శిక్షణ ఇవ్వడమే కాక ధ్రువపత్రాలు అందజేశారు. ఈ శిక్షణ ఇటీవలే పూర్తికాగా, సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ అధ్యక్షతన సర్టిఫికెట్లు అందచేసి అభినందించారు. ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి రంగాల్లో స్థిరపడాలని సూచించారు.

ఇరవై ఏళ్లలో 4వేలకు మందికి పైగా..

ఇల్లెందు ఏరియాలో సింగరేణి సేవా సమితి 2003లో ఏర్పడింది. గతేడాది వరకు 177 బ్యాచ్‌లుగా 4,278 మందికి వివిధ కోర్సుల్లో శిక్షణ ఇచ్చారు. అలాగే, ఎలక్ట్రీషియన్ విభాగంలో 89 మందికి, రేడియో, టీవీ మెకానిజం, వీడియో, ఫొటోగ్రఫీలో 37 మందికి, టైలరింగ్‌లో 1,269 మంది, శారీ రోలింగ్‌లో 12 మంది, మగ్గం వర్క్‌లో 470 మంది, బ్యూటీషియన్ 371 మంది శిక్షణ పూర్తిచేసుకున్నారు. అలాగే, కంప్యూటర్ కోర్సుల్లో 236 మంది, కారు డ్రైవింగ్‌లో 348 మంది, ఆర్మీ, పోలీస్ ఉద్యోగాలకు 1,143 మంది, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌లో 220 మంది, స్పోకెన్ ఇంగ్లిష్‌లో 11 మంది, ఫ్యాషన్ డిజైనింగ్‌లో 40మంది శిక్షణ పూర్తిచేసుకోగా.. పలువురు స్వయం ఉపాధి పొందుతూ మరికొందరికి ఉపాధి చూపిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి...



సింగరేణి సేవా సమితి ద్వారా మహిళలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ శిక్షణ ఏర్పాటుచేస్తున్నాం. ఆసక్తి ఉన్న వారు శిక్షణ తీసుకుంటే ఉపాధికి అవకాశాలుంటాయి. తద్వారా కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలవొచ్చు.

– విజయ, సెక్రటరీ, సింగరేణి సేవా సమితి

ఉచిత శిక్షణతో ఉపయోగం...



సింగరేణి సేవా సమితి ద్వారా ఇచ్చినటైలరింగ్ శిక్షణతో మేలు జరుగుతుంది. ఇంటి వద్దే పనిచేసుకుంటూ కుటుంబానికి అండగా నిలవొచ్చు. మాకు సమీపంలోనే ఇచ్చిన ఉచిత టైలరింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకున్నాం.

– నీలిమ, ఇల్లెందు

మెళకువలు అవసరం..



ఉచితంగా మగ్గం వర్క్‌లో శిక్షణ ఇస్తున్నారని వచ్చాను. సాధారణంగా కాకుండా నిపుణులతో శిక్షణ ఇప్పించారు. మగ్గం వర్క్ రావడం వల్ల సొంతంగా చీరలకే కాకుండా ఇతరులకు కూడా వర్క్ చేస్తూ ఉపాధి పొందొచ్చు.

– లలిత సాహితీ, ఇల్లెందు

మెరుగైన ఉపాధి మార్గాలు



ఫంక్షన్లు, పండుగల బ్యూటీపార్లర్లకు ఆదరణ బాగుంటుంది. ఈ తరుణాన సింగరేణి సేవాసమితి ద్వారా ఉచితంగా శిక్షణ ఇచ్చి ధ్రువపత్రం అందజేశారు. బ్యూటీషియన్ ద్వారా మెరుగైన ఉపాధి మార్గాలు ఉండడంతో శిక్షణ తీసుకున్నా.

– పుష్ప, ఇల్లెందు

మత్స్యకారులకు ముగిసిన శిక్షణ



సర్టిఫికెట్లు అందుకుంటున్న మత్స్యకారులు

కూసుమంచి: పాలేరులోని శ్రీ పీ.వీ.నర్సింహారావు మత్స్య పరిశోధనా కేంద్రంలో 'చేపల మేత తయారీ – యాజమాన్య పద్ధతులు' అంశంపై మూడు రోజులుగా మత్స్యకారులకు ఏర్పాటుచేసిన శిక్షణ శుక్రవారం ముగిసింది. ఖమ్మం, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ, రాజన్న సిరిసిల్ల, మెదక్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాలకు చెందిన 25 మంది మత్స్యకారులు పాల్గొనగా వీరికి నైపుణ్య సర్టిఫికెట్లు అందజేశారు. ముగింపు సమావేశంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ జి.ప్రసాద్ పాల్గొని బ్యాంకు పథకాలను వివరించారు. పాలేరు పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, మత్స్య శాస్త్రవేత్తలు రవీందర్, అనూష తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యసాధనలో మేటిగా కిష్టారం ఓసీ



కొత్తగూడెం ఏరియాలోని కిష్టారం ఓసీ ముఖచిత్రం

- 83 రోజుల ముందే బొగ్గు ఉత్పత్తి లక్ష్యం పూర్తి
- ఒక్క ప్రమాదం కూడా లేకుండా ఉత్పత్తి చేయడంపై ప్రశంసలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణివ్యాప్తంగా కిష్టారం ఓసీ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని 83 రోజుల ముందుగానే పూర్తిచేసి రికార్డు సృష్టించింది. కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీకి యాజమాన్యం ఈ ఏడాది 20 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే, 83 రోజుల ముందుగానే (ఈనెల 8వ తేదీ నాటికి 132 శాతం) సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. సింగరేణి చరిత్రలో ఏ ఓసీ కూడా ఇంత ముందుగా ఉత్పత్తి సాధించిన దాఖలాలు లేవు. అధికారుల సూచనలు, ఉద్యోగులు, కార్మికుల కృషితో లక్ష్యసాధనకు ఆర్థిక సంవత్సరం మొదటి నుంచి ప్రణాళికాయుతంగా ముందుకు సాగడంతో ఈ విజయం సాధ్యమైందని చెబుతున్నారు. కాగా, సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఈ ఏడాది 75 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలనేది లక్ష్యం కాగా.. రోజుకు సుమారు 3 లక్షల టన్నులు ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పటివరకు 56.94 మిలియన్ టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా 51.69 మిలియన్ టన్నులు నమోదైంది. ఆర్థిక సంవత్సరం ముగియనున్న 82 రోజుల్లో 23.31 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉంది. కాగా, ఓసీల్లో 5,05,33,001 టన్నులు, భూగర్భ గనుల్లో 64,10,439 టన్నుల బొగ్గు ఉత్పత్తి నమోదైంది.

ప్రమాదరహితంగా లక్ష్యసాధన



కొత్తగూడెం ఏరియా పరిధిలోని కిష్టారం ఓసీ వార్షిక లక్ష్యం 20 లక్షల టన్నులను ముందుగానే సాధించింది. ఈ ఏడాది ఒక్క ప్రమాదం కూడా జరగకుండా లక్ష్యాన్ని చేరుకున్నారు. కంపెనీ సూచించిన రక్షణ సూత్రాలను పాటిస్తూ లక్ష్యాన్ని చేరుకున్న అధికారులు, ఉద్యోగులు, కార్మికులు అభినందనీయులు. మిగిలిన ఏరియాల ఉద్యోగులు కూడా లక్ష్యసాధనకు కృషి చేయాలి.

– ఎం.శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

వారధిగా ఆనకట్ట !



గోదావరిలో నీరు తగ్గుముఖం పట్టడంతో అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వారధిలా ఉపయోగపడుతోంది. అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల ప్రజలు తమ అవసరాల నిమిత్తం ఆనకట్ట మీదుగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ఆనకట్ట వర్షాకాలంలో నీరు ఉప్పొంగి ప్రవహిస్తూ, శీతాకాలంలో నీరు జాలువారుతూ జలపాతంలా కనిపిస్తుంది. ఇప్పుడు నీరు తగ్గాక వారధిలా ఉపయోగపడుతుండడం విశేషం.

– అశ్వాపురం